క్లుప్తంగా

వివాహితపై దాడి

శ్రీకాకుళం క్రైమ్: వివాహితపై వ్యక్తి దాడి చేసినట్లు ఫిర్యాదు అందిందని ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్ ఎస్సై గణేష్ సోమవారం తెలిపారు. గార మండలం బలరాంపురం గ్రామానికి చెందిన వివాహితతో నగరానికి చెందిన ఆకుల సురేష్‌కు పరిచయం ఉంది. ఈ విషయం ఆమె భర్తకు ఎక్కడ తెలుస్తుందోనని సురేష్‌ను దూరం పెట్టింది. దీంతో ఆగ్రహించిన ఆయన ఈనెల 23 రాత్రి ఆమె ఇంటికి వెళ్లి గొడవపడి అసభ్యకరంగా మాట్లాడటంతో పాటు చేయిచేసుకున్నాడు. అలాగే నగరంలోని ఓ చికెన్‌షాపు వద్దకు వెళ్లి అక్కడ కూడా గొడవ చేయడంతోపాటు అక్కడికి వచ్చిన వివాహితను తలపట్టుకుని ఆగివున్న కారుకు ఢీకొట్టాడు. అందిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

అపరిచిత వ్యక్తుల సమాచారం ఇవ్వాలి


సిబ్బందికి సూచనలిస్తున్న ఎస్‌ఐ రామారావు

జి.సిగడాం: పండగల నేపథ్యంలో పల్లెల్లో అపరిచిత వ్యక్తులు సంచరిస్తే అటువంటి వారిపై స్థానిక పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని ఎస్‌ఐ సామంతుల రామారావు సూచించారు. సోమవారం స్టేషన్ సిబ్బందితో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. పల్లెల్లో సంక్రాంతి, యాత్రల సందర్భంగా గ్రామాలకు గుర్తుతెలియని వక్తులు వస్తే వెంటనే వారి దగ్గర ఉన్న గుర్తింపు కార్డులు తీసుకుని సమాచారం ఇవ్వాలన్నారు. దొంగతనాలను అరికట్టేందుకు ప్రత్యేక నిఘా వేయాలన్నారు. లైసెన్స్, వాహన పత్రాలు లేకపోతే అటువంటి వారిపై చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ హెచ్చరించారు.

అర్హులందరికీ 'ఆసరా'


మహిళతో థంబ్ వేయిస్తున్న రామ్‌మనోహర్ నాయుడు

శ్రీకాకుళం రూరల్: అర్హులైన వారందరికీ ఆసరా పథకం వర్తిస్తోందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ యువనేత ధర్మాన రామ్‌మనోహర్‌నాయుడు స్పష్టం చేశారు. పెదపాడు గ్రామంలో ఆసరా మహిళలతో సోమవారం ఆయన మాట్లాడారు. టీడీపీ నాయకుల్లా ఇచ్చిన హామీలను అమలు చేయకుండా మాట మార్చడం వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం చేయలేదన్నారు. ఇచ్చిన మాట ప్రకారం వరుసగా మూడు విడతల్లో ఆసరా నిధులను అందజేశామన్నారు. నాలుగు విడత నిధులు జనవరి నెలలో మహిళల బ్యాంకు అకౌంట్లకు జమ చేస్తామన్నారు. ఈసందర్భంగా ఆసరా మహిళలచే స్థానిక సచివాలయంలో థంబ్‌లు వేయించారు. రానున్న ఎన్నికల్లో సంక్షేమ ప్రభుత్వానికి పట్టం కట్టాలని కోరారు. పలువురు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

కరాటేతో ఆత్మరక్షణ


శిక్షణ పొందుతున్న చిన్నారులతో కరాటే శిక్షకులు

రణస్థలం: కరాటేతో ఆత్మరక్షణ కలుగుతుందని జిల్లా పెన్‌కాట్ సిలాట్ ప్రెసిడెంట్ రేగిడి దయామయ అన్నారు. మండలంలోని జే.ఆర్.పురం హైస్కూల్లో కరాటేలో (వివిధ స్థాయిల్లో) ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు సోమవారం బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కరాటేతో మనోధైర్యం పెరుగుతుందన్నారు. టైగర్ అకాడమీ శిక్షకుడు లింగాల ఈశ్వరరావు, వివిధ అకాడమీ కరాటే శిక్షకులు శింక సంతోష్, నక్క లక్ష్మణనాయుడు, చంటి, పర్వేజ్, శిమ్మారావు తదితరులు పాల్గొన్నారు.

న్యూటన్‌కు ఘనంగా నివాళి


న్యూటన్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం న్యూకాలనీ: శ్రీకాకుళం నగరంలోని ఎల్‌ఐసీ కార్యాలయానికి సమీపంలో ఉన్న కాకినాడ ఆదిత్య మహిళా డిగ్రీ కళాశాలలో సోమవారం న్యూటన్ జయంతి వేడుకలను నిర్వహించారు. కళాశాల డైరెక్టర్ బీఎస్ చక్రవర్తి, ప్రిన్సిపాల్ కె.శివశంకర్ న్యూటన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. ప్రస్తుతం మనం రాకెట్ ప్రయోగాలు చేయడానికి, విమానాల్లో ప్రయాణిస్తున్నామన్నా న్యూటన్ ముఖ్య కారణమన్నారు. భౌతికశాస్త్రంలో న్యూటన్ సరికొత్త అధ్యయనాన్ని సృష్టించారని చెప్పారు. ఫిజిక్స్ విభాగాధిపతి హనుమంతు మాధవి, అధ్యాపకురాలు దివ్య, రమ్య ఉన్నారు.

ఏసుప్రభు లోకరక్షకుడు

ఏసుక్రీస్తు లోకరక్షకుడని వక్తలు అన్నారు. ప్రపంచానికి దారి చూపేవాడు, దయామయుడు ఏసుప్రభువన్నారు. క్రిస్మస్ పండుగను క్రైస్తవులు సోమవారం ఘనంగా జరుపుకున్నారు. ఆదివారం అర్ధరాత్రి నుంచే చర్చిలకు వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. క్రీస్తు జననాన్ని బిషప్‌లు, పాస్టర్లు వివరించారు. ఈ సందర్భంగా చర్చిలను విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు. కేక్‌లను కట్‌చేసి పంచిపెట్టారు. నిరుపేదలకు వస్త్రదానం చేశారు. ప్రార్థనల్లో ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొని క్రిస్మస్ శుభాకాంక్షలను తెలియజేశారు. ఈ సందర్భంగా చర్చిల్లో ఏర్పాటు చేసిన వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.


శ్రీకాకుళం కల్చరల్: ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన పురిపాకలో బాల ఏసుకు ప్రార్థనలు చేస్తున్న బిషప్ విజయకుమార్


శ్రీకాకుళం కల్చరల్: సహాయమాత చర్చిలో ప్రార్థనలు చేస్తూ..


జి.సిగడాం: మెట్టవలసలో దుస్తులు పంపిణీ చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు


జి.సిగడాం: పాలఖండ్యాం-మెట్టవలస గ్రామాల సమీపంలోని కల్వరి చర్చ్‌లో గేయాలను ఆలపిస్తున్న యువతులు


కీస్టోన్ చర్చిలో నృత్యాలు చేస్తున్న యువత


రణస్థలం: జే.ఆర్.పురం డబ్ల్యూఎంఈ చర్చిలో క్రిస్మస్ కేక్ కట్ చేస్తున్న ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్


క్రైస్తవ ఆరాధన మందిరంలో గీతాలాపనలు


తెలుగు బాప్టిస్టు చర్చిలో పాస్టర్ క్రీస్తు సందేశం


రణస్థలం: జే.ఆర్.పురం లూథరన్ చర్చిలో ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు


కీస్టోన్ చర్చిలో ప్రసంగిస్తున్న పాస్టర్ జోయెల్


శ్రీకాకుళం రూరల్: గేదెలవానిపేటలో క్రిస్మస్ కేక్ కట్ చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు ధర్మాన రామ్‌మనోహర్‌నాయుడు


శ్రీకాకుళం కల్చరల్:ఫెయిత్ హోమ్ చర్చిలో క్రిస్మస్ సందడి..


శ్రీకాకుళం కల్చరల్: తెలుగు బాప్టిస్టు చర్చిలో యువత సాంస్కృతిక ప్రదర్శన


శ్రీకాకుళం కల్చరల్: న్యూఫ్రెండ్స్ ఆఫ్ దిఎర్త్ వాలంటీ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో పేదమహిళలకు దుస్తులు పంపిణీ చేస్తున్న శ్రీనివాసపట్నాయక్


శ్రీకాకుళం కల్చరల్: లూథరన్ చర్చిలో ప్రార్థనలు


పార్థనలు చేస్తున్న క్రైస్తవులు


శ్రీకాకుళం కల్చరల్: ట్రినిటీ బాప్టిస్టు చర్చిలో క్రీస్తు సందేశాన్ని వినిపిస్తూ..


గార: మహిమ మందిరం క్రిస్మస్ క్యాండిల్ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, పాస్టర్లు


గార:మహిళల గీతాలాపన

స్టార్ వాకర్స్ క్లబ్‌కు ఉత్తమ అవార్డు


శ్రీకాకుళం: షీల్డ్‌తో శ్రీకాకుళం స్టార్ వాకర్స్ క్లబ్ సభ్యులు


జ్ఞాపికను అందుకుంటున్న ఉమామహేశ్వరరావు

శ్రీకాకుళం: విశాఖపట్నంలో జరిగిన అంతర్జాతీయ నడక సంఘాల సదస్సులో శ్రీకాకుళం జిల్లా నడక సంఘాల సభ్యులు పతకాలు సాధించారని స్టార్ వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు ఎస్.జోగినాయుడు తెలిపారు. ఈ నెల 24, 25వ తేదీల్లో విశాఖలో నడక సంఘాల పోటీలు నిర్వహించారు. శ్రీకాకుళం నగరానికి చెందిన స్టార్ వాకర్స్ క్లబ్‌కు ఉత్తమ అవార్డ్ దక్కింది. నడక సంఘాల నాయకులు జి.ఇందిరాప్రసాద్, పి.జి.గుప్తా, కూన వెంకటరమణమూర్తి, క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

పోలుమహంతికి విశిష్ట వాకర్స్ అవార్డు

శ్రీకాకుళం (పీఎస్‌కాలనీ): ఉత్తరాంధ్రలో గతంలో జిల్లా 102 వాకర్స్ ఇంటర్నేషనల్ గవర్నర్‌గా పని చేసిన అనుభవంతో నడక ప్రాచుర్యం పెంచినందుకుగాను ఆదిత్య వాకర్స్ క్లబ్ వ్యవస్థాపకులు పోలుమహంతి ఉమామహేశ్వరరావుకి జ్ఞాపికనందించారు. విశాఖలోని ఆంధ్రా యూనివర్సిటీ కాన్వోకేషన్ హాల్లో వాకర్స్ ఇంటర్నేషనల్ సమావేశంలో ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ ఎస్పీ రవీంద్ర నుంచి ఉమామహేశ్వరరావుకు అవార్డును అందించి సత్కరించారు. కార్యక్రమంలో పూర్వ వాకర్స్ ఇంటర్నేషనల్ అధ్యక్షుడు ఎ.ఎస్.ఎన్.రాజుశర్మ, కృష్ణకుమారి, పద్మనాభం, మురళీమోహనరావు, ఆదిత్య వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు బురిడీ గౌరీశంకర్, బి.ప్రభాకర్ పటా్నయక్, జి.ఆర్.జి.నాయుడు, సూర్య, రొక్కం నారాయణరావుదొర, పి.వి.గుప్త, నాగేశ్వరరావు, కె.వి.రమణమూర్తి, గవర్నర్ సత్యం పాల్గొన్నారు.

అటల్ ట్రోఫీ పేరిట వాలీబాల్ పోటీలు


గోడ పత్రికలను ఆవిష్కరిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లాలో అటల్ ట్రోఫీ పేరిట జిల్లాస్థాయి వాలీబాల్ పోటీలను త్వరలో నిర్వహించనున్నట్లు బీజేపీ యువ మోర్చా జిల్లా అధ్యక్షుడు బూరే నరేంద్రచక్రవర్తి చెప్పారు. యువ మోర్చా శ్రీకాకుళం జిల్లా ఆధ్వర్యంలో పార్టీ కార్యాలయంలో మాజీ ప్రధానమంత్రి అటల్ బిహారి వాజ్‌పేయి జయంతి సందర్భంగా సోమవారం ఆయనకు ఘనంగా నివాళులర్పించారు. అనంతరం అటల్ ట్రోఫీ జిల్లా స్థాయి వాలీబాల్ టోర్నమెంట్ గోడ పత్రికలను నాయకులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అట్టాడ రవిబాబ్జీ, ఉత్తరాంధ్ర జోనల్ ఇన్‌చార్జి విశ్వతేజ, శ్రీకాకుళం జిల్లా ఇన్‌చార్జి సతీష్, జిల్లా ప్రధాన కార్యదర్శుల రాజు వెంకట్, తారక రామారావు పాల్గొన్నారు.

వాజ్‌పేయికి ఘనంగా నివాళులు


మిఠాయిలు పంచుతున్న రఘురాం

జి.సిగడాం: మండలంలోని ఆనందపురం గ్రామంలో గల శక్తి కేంద్రంలో సోమవారం రాత్రి మాజీ ప్రధాన మంత్రి అటల్‌బిహారీ వాజ్‌పేయి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్థానిక రైల్వేస్టేషన్ అభివృద్ధి కమిటీ సభ్యుడు వజ్జిపత్తి రఘురాం ఆధ్వర్యంలో కేట్ కట్ చేసి పంచిపెట్టారు. దేశానికి వాజ్‌పేయి చేసిన అభివృద్ధి, సేవలను కొనియాడారు. గ్రామస్తులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీకి వైద్యాధికారి నియామకం


డాక్టర్ అరుణకు నియామకపత్రం అందజేస్తున్న ఏఓ రామకృష్ణ, డైరెక్టర్ బాలజీ

ఎచ్చెర్ల క్యాంపస్: శ్రీకాకుళం రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయంలో విద్యార్థులకు మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యమని ఎస్ఎంపురం క్యాంపస్ డైరెక్టర్ కొక్కిరాల వెంకట ధన బాలజీ అన్నారు. క్యాంపస్ వైద్యాధికారిగా డాక్టర్ బి.అరుణ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. పలు ఆస్పత్రుల్లో సీనియర్ వైద్యాధికారిగా ఈమె సేవలు అందించారు. డైరెక్టర్ మాట్లాడుతూ చాన్సలర్ ప్రొఫెసర్ కేసీ రెడ్డి మార్గదర్శకాలకు అనుగుణంగా మెరుగైన వైద్య సేవలు అందించనున్నట్లు చెప్పారు. స్థానికంగా వైద్య సేవలు, అవసరమైన మందులు అందుబాటులో ఉంచుతున్నట్లు తెలిపారు. 24 గంటలూ అంబులెన్స్ అందుబాటులో ఉంచి అవసరమైతే శ్రీకాకుళం రిమ్స్ ఆస్పత్రికి తీసుకువెళ్తామన్నారు. ప్రధానంగా విద్యార్థినులు ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి పెడుతున్నట్లు తెలిపారు. పరిపాలన అధికారి మునిరామకృష్ణ నియామక ధ్రువీకరణ పత్రం అందజేశారు.

సందడిగా మెకానిక్‌ల పిక్నిక్


పొన్నాడలో జరిగిన మెకానిక్‌ల పిక్నిక్

శ్రీకాకుళం కల్చరల్: స్థానిక పొన్నాడ గ్రామం తోటలో దుర్గా స్కూటర్, మోటర్ సైకిల్ మెకానిక్‌ల సంక్షేమ సంఘం పిక్నిక్ ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా ప్రజా సమస్యల వేదిక అధ్యక్షుడు బెవర వెంకట రవిశంకర్ మాట్లాడుతూ అమరాన్ కంపెనీ ఉత్పత్తులపై ప్రసంగించారు. శ్రీకాకుళం పోస్టాఫీస్ మేనేజర్ షరీఫ్ మాట్లాడుతూ మెకానిక్‌లకు తక్కువ ప్రీమియంతో బీమా అవకాశం ఉందని, వినియోగించుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా లక్కీ డ్రా తీసి విజేతలకు బహుమతులు అందచేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ ఉపాధ్యక్షుడు చల్లా వెంకటేశ్వరరావు, కోశాధికారి మొదలవలస సుధా, సాయి, మునికోటి గణేష్, అమరాన్ సర్వీసు ఇంజినీర్ కె.తునిష్, కిరణ్ ఆటో మొబైల్ సిబ్బంది కుప్పిలి ఆనంద్, ఎస్. హేమంత్, ఎ.గోవింద్, ఎ.శేఖర్, ఎస్.సురేష్, రోహిత్ రాయ్, తదితరులు పాల్గొన్నారు.

కరోనాపై అవగాహన


మాస్కులు పంపిణీ చేస్తున్న రెడ్‌క్రాస్ సంస్థ ప్రతినిధులు

ఎచ్చెర్ల, లావేరు: కరోనా కొత్త వేరియంట్ వ్యాప్తి చెందుతున్న కారణంగా వ్యాధి నివారణ చర్యల్లో భాగంగా ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ శ్రీకాకుళం జిల్లా శాఖ ప్రతినిధులు బుడుమూరు సంత, పరిసర గ్రామాల్లో సోమవారం అవగాహన కార్యక్రమాలను చేపట్టారు. కరోనా నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై చైతన్యరథం, కరపత్రాల పంపిణీ ద్వారా అవగాహన కల్పించారు. రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహన్‌రావు చేతుల మీదుగా జిల్లా వైద్యశాఖ ఆవరణ సమీపంలో 1,000 మందికి మాస్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ కరోనా నివారణకు రెడ్‌క్రాస్ చైతన్య రథాలు, జూనియర్ వలంటీర్లు, రెడ్‌క్రాస్ యూత్ ద్వారా కార్యక్రమాలు చేపడతామన్నారు. జన సమూహాలు ఉండేటప్పుడు ప్రజలు మరింత అప్రమత్తంగా ఉండాలన్నారు. రెడ్‌క్రాస్ కో-ఆర్డినేటర్ కె సత్యనారాయణ, సిబ్బంది సతీష్, సుజాత, పవన్ తదితరులు పాల్గొన్నారు.

స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్ర భవనానికి శంకుస్థాపన

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని బ్యాంకర్స్ కాలనీలో ఉన్న సత్యసాయి బృందావనంలో శాశ్వత స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రం నిర్మాణానికి సత్యసాయి సేవా సంస్థల రాష్ట్ర అధ్యక్షుడు రఘుపాత్రుని లక్ష్మణరావు సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సెంటర్ ద్వారా యువతీయువకులకు కంప్యూటర్, ఫ్యాషన్ డిజైనింగ్, ఏసీ మెకానిజం, మగ్గం వర్కు, కుట్టురంగాల్లో శిక్షణ ఉచితంగా అందిస్తామన్నారు. జిల్లా పరిషత్ సీఈవో వెంకట్రామన్, సమితి అధ్యక్షులు ప్రసాద్ పాల్గొన్నారు.

భక్తిమార్గం ద్వారా జ్ఞానం


వక్త నారాయణమూర్తిని సత్కరిస్తున్న మందిరం సభ్యులు

శ్రీకాకుళం కల్చరల్: భక్తిమార్గం ద్వారా జ్ఞానమార్గాన్ని పొందవచ్చని డాక్టర్ సనపల నారాయణమూర్తి అన్నారు. స్థానిక ఉపనిషన్మందిరంలో భగవద్గీత-జ్ఞానమార్గం అనే అంశంపై సోమవారం ప్రసంగం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తత్వాన్ని అర్థం చేసుకుంటూ గీతను అధ్యయనం చేసినవారే ఉత్తమ ఫలితాన్ని పొందగలరన్నారు. ముందుగా వక్త నారాయణ మూర్తిని సత్కరించారు. కార్యక్రమంలో చంద్రరావు, విశ్వేశ్వరరావు, రమణారావు, వి.ఎస్.ఎస్.ప్రసాద్, సుధాకరశర్మ, సరస్వతి, నిర్మల, తవుడు, సీతమ్మ, కళావతి, బాబూరావు ఉన్నారు.

అయోధ్య రాముని అక్షింతలు పంపిణీ

ఎచ్చెర్ల క్యాంపస్: అయోధ్య రాముడి అక్షింతలను కుశాలపురంలో సోమవారం శోభాయాత్ర నిర్వహించారు. భజన కార్యక్రమం నిర్వహించి, అక్షింతలు ఊరేగించారు. అనంతరం గ్రామంలో విశ్వహిందూ పరిషత్, భజరంగదల్ సభ్యులు ఇంటింటికీ వెళ్లి పంపిణీ చేశారు. ఎచ్చెర్ల మండలానికి సంబంధించి అయోధ్య అక్షింతలు కుంచాలకూర్మయ్యపేటలోని దేవీ పీఠంలో ఉంచి అన్ని గ్రామాలకు చేరవేస్తున్నారు.

ఆరోగ్యశ్రీ స్మార్టు కార్డులు అందజేత


ఆరోగ్య శ్రీ కార్డులు పంపిణీ దృశ్యం

గార: ఆరోగ్యశ్రీ పరిధిని రూ. 5 లక్షల నుంచి రూ. 25 లక్షలకు పెంచడం వలన దీర్ఘకాలిక రోగులకు లబ్ధి చేకూరుతుందని ఎంపీపీ గొండు రఘురామ్ అన్నారు. అంపోలు పంచాయతీ చల్లపేటలోని లబ్ధిదారులకు ఆరోగ్యశ్రీ స్మార్టు కార్డులను సోమవారం పంపిణీ చేశారు. రోగులకు మరిన్ని సేవలందించేందుకు నెట్‌వర్కును విస్తరించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ గొండు కృష్ణమూర్తి, సర్పంచ్ గొండు జయరాం ఉన్నారు.

నేడు ఆడుదాం-ఆంధ్రా పోటీలు ప్రారంభం

జి.సిగడాం: రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాంగా నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్రా పోటీలను విజయవంతం చేయాలని ఎంపీడీఓ కె.నిర్మల, ఈఓపీఆర్డీ ఎస్.శ్రీనివాసరావు కోరారు. సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఉదయం 10 గంటల నుంచి జి.సిగడాం, పెంట, వెలగాడ, డీఆర్‌వలస సచివాలయాల పరిధిలో ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలు నిర్వహించనున్నామని వెల్లడించారు. ఆన్‌లైన్‌లో పేర్లు నమోదు చేసుకున్న క్రీడాకారులు హాజరు కావాలన్నారు. సచివాలయం పరిధిలో గెలుపొందిన విజేతలు మండల స్థాయికి పోటీలకు అర్హత సాధిస్తారన్నారు.